క్లుప్తంగా

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలంలోని ఆమనిచిరువెళ్ల సచివాలయ పరిధిలో 14, 15 తేదీల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16, 17 తేదీల్లో చేజర్ల మండలంలోని పాతపాడు సచివాలయ పరిధిలో జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 4.30 గంటల నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

వెంగమాంబ పేరంటాలకు ప్రత్యేక బస్సులు

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి నర్రవాడలో జరుగుతున్న వెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలకు బుధ, గురువారాల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలు–నర్రవాడ, ఉదయగిరి–నర్రవాడ, సీతారామపురం–నర్రవాడ, పోరుమామిళ్ల–నర్రవాడ మార్గాల్లో ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ఆయా కూడళ్లలో కంట్రోల్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి అమ్మవారిని దర్శించుకోవాలన్నారు. భక్తుల రద్దీని బట్టి అదనంగా సర్వీసులు నడుపుతామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలకు సూచనలిస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు

ఉదయగిరి: మండలంలోని కొండాయపాళెం, ఉదయగిరి సమీపంలో జరుగుతున్న ఎంఐ ట్యాంక్, చెక్‌డ్యాం పనులను మంగళవారం ఏపీఓ బి.శ్రీనివాసరావు పరిశీలించారు. మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం పనులు చేసుకుని ప్రభుత్వం నిర్దేశించిన గిట్టుబాటు కూలీ నగదు పొందాలన్నారు. పని జరిగే ప్రదేశంలోని ఫొటోలను టీఏ, ఎఫ్ఏలు ఉదయం ఏడు గంటల్లోపు అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో పనులు జరిపించాలని టీఏ, ఎఫ్ఏలకు సూచించారు.

రెవెన్యూ సదస్సుకు ఆరు అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు లక్ష్మీప్రసన్న

సంగం: మండలంలోని సిద్దీపురం సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆరు అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రజలందరూ ఈ సదస్సులను సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. తహసీల్దారు వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి రైతుభరోసా కేంద్ర పరిధిలోని రైతులు ప్రభుత్వం రాయితీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తున్నామని వీఏఏ కనసాని వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆర్బీకేలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు 50 శాతం రాయితీపై జనుములు 10 కేజీల బ్యాగ్ రూ.420, పిల్లిపెసర 8 కేజీల బ్యాగ్ రూ.390, జీలగలు 10 కేజీల బ్యాగ్ రూ.400 అందజేస్తున్నామన్నారు. అవసరమైన రైతులు పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలు తీసుకొచ్చి విత్తనాలు, ఎరువులు పొందవచ్చన్నారు.

నిరుపేద కుటుంబానికి వైఎస్సార్ బీమా

కావలి: పట్టణంలోని 28 వార్డు దారావారివీధికి చెందిన దాసరి రాయల్ ఈ నెల 10న బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో ఆ కుటుంబ పరిస్థితిని స్థానిక నాయకులు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన అధికారులతో చర్చించి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. మిగిలిన రూ.90 వేలు కూడా మృతుడి కుటుంబానికి అందించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వార్డు కన్వీనర్ సున్నా మురళీ, ఇన్‌చార్జి దావులూరి పవిత్రన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు.

విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు

కొండాపురం: మండలంలోని మర్రిగుంట జెడ్పీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీహరి, వైస్ సర్పంచ్ విగ్నేష్ జగనన్న విద్యా కానుక కిట్లు అందించారు. విగ్నేష్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వంచేయని విధంగా జగనన్న విద్యార్థుల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

ఈకేవైసీ ఇక ఈజీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు ఈకేవైసీని ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. రైతుభరోసా సాయం అందాలన్నా, పీఎం కిసాన్ సొమ్ము ఖాతాలకు జమ కావాలన్నా ఇవి తప్పనిసరి. విధిగా ప్రతి రైతు ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ–క్రాప్ నమోదు చేసుకున్నప్పటికీ ఈకేవైసీ ప్రక్రియ పూర్తికాక ఏటా కొంత శాతం మంది రైతులు ఆర్థిక లబ్ధి పొందలేకపోతున్నారు.ఈ ఇబ్బందులు అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది.

- అందుబాటులోకి 'కిసాన్ యాప్'
- ఎక్కడినుంచైనా పూర్తి చేసుకునే అవకాశం



ఈకేవైసీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

దుత్తలూరు: సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పటికీ ఈకేవైసీపై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం, రైతులు స్థానికంగా అందుబాటులో ఉండకపోవడంతో ఈ ప్రక్రియను చేసుకోలేకపోవడంతో ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు పొందలేకపోతున్నారు. ఈకేవైసీ పూర్తి చేయించుకునేందుకు ఇకపై అధికారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అన్నదాతల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం కిసాన్‌యాప్ అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్ ఫోన్‌లోనే ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకునే అవకాశం రైతుల ముంగిటకే వచ్చింది. నియోజకవర్గంలోని 8 మండలాల్లో మొత్తం 45,914 మంది రైతులు ఉండగా ఇంకా 9,104 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేయించుకోవాల్సి ఉంది. మిగిలిన వారికి పీఎం కిసాన్ యాప్ ద్వారా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. గతంలో ఈకేవైసీ పూర్తి చేయించేందుకు ప్రభుత్వాలు పలుమార్లు గడువు పెంచినా నూరు శాతం పూర్తయ్యేందుకు అధికారులకు తలకుమించిన భారంగా మారింది. నమోదు సులభతరం కావడంతో రైతులు ప్రభుత్వం సాయం పొందేందుకు ఇలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు భావిస్తున్నారు.

స్మార్ట్‌ఫోన్ ద్వారా ఇలా ఈకేవైసీ

ఈ–క్రాప్, ఈకేవైసీ, ముఖ ఆధారిత విధానంలో నమోదు ప్రక్రియ ఎవరికి వారే పూర్తి చేసుకోవచ్చు. ముందుగా సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి పీఎం కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ యాప్‌లో ఆధార్ సంఖ్య నమోదు చేయగానే పీఎం కిసాన్ దరఖాస్తులో నమోదు చేసిన సెల్‌ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తుంది. దీనికి ఆధార్ లింకుతో సంబంధం ఉండదు. ఓటీపీ నమోదు చేయగానే ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరు నమోదు చేసుకున్నట్లుగానే ఫోన్‌లో ముందు కెమెరా ఎదురుగా కళ్లు కదిలించాలి. అదే రైతు అదే కళ్లు అయితే యాప్‌లో ఓకే అని వస్తుంది. దీంతో ఈకేవైసీ ప్రక్రియ పూర్తయి రైతులకు సంబంధించిన పూర్తి వివరాలు వస్తాయి.

ఈకేవైసీ పూర్తి చేయని రైతులు

మండలం	రైతులు	
కొండాపురం	7,861	1,526
సీతారామపురం	3,078	231
వరికుంటపాడు	6,397	1,521
దుత్తలూరు	4,928	1,365
కలిగిరి	6,632	920
జలదంకి	7,288	1,636
వింజమూరు	4,792	992
ఉదయగిరి	4,941	1,023
మొత్తం	48,914	9,104

సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలి



ప్రభుత్వాలు అన్నదాతల కోసం సాంకేతికతను అందుబాటులోకి తెచ్చాయి. రైతులు ఈకేవైసీని ఎక్కడి నుంచైనా పూర్తి చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానం ద్వారా వ్యవసాయశాఖ సిబ్బంది ప్రస్తుతం పలువురికి ఈకేవైసీ పూర్తిచేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ లబ్ధిపొందాలి.

– ఎస్.వెంకటసుబ్బారెడ్డి, ఏఓ, దుత్తలూరు

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): గ్రామీణ స్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రధానంగా రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై అధికార యంత్రాంగం స్పందించి 45 రోజుల్లోగా వలంటీర్ల సహకారంతో ప్రజా సమస్యలపై నివేదికలు సమర్పించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట కాల పరిమితిలోగా చర్యలు తీసుకుంటామన్నారు. చుక్కల భూముల సమస్యపై ప్రభుత్వం జారీ చేసిన జీఓ ద్వారా 80 శాతం రైతుల సమస్యలు పరిష్కారం అయ్యాయని, వారందరికీ పట్టాదారు పుస్తకాలు మంజూరు చేయిస్తామన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ పనులకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే కలెక్టర్, జేసీ, ఆర్డీఓలను క్షేత్ర స్థాయికి పంపి సాదాబైనామా, వారసత్వ సమస్యలను పరిష్కరించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. మూడు నెలల్లోగా దశాబ్దకాలంగా పేరుకుపోయిన పడమటినాయుడుపల్లి హైలెవల్ కెనాల్ నిర్వాసితుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. గృహనిర్మాణ శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మించే 15 వేల ఇళ్లు మంజూరయ్యాయని లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని అర్హులందరికీ ఇళ్లు నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మర్రిపాడు ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు నాయుడు హజరత్‌రెడ్డి, పార్లపల్లి కొండారెడ్డి, తదితరులు పలు సమస్యలపై సమావేశం దృష్టికి తెచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్ ఖాన్, తహసీల్దారు ఆనంద్ రావు, వైస్ ఎంపీపీ చప్పిడి రమణమ్మ, సొసైటీ అధ్యక్షుడు సోమల మాధవరెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సర్పంచ్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సచివాలయాల్లో జేసీ తనిఖీ



అల్లూరు–3 సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

అల్లూరు: మండలంలోని బీరంగుంట సచివాలయం, అల్లూరు–3 సచివాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను, సిబ్బంది హాజరు పట్టీని తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగనుండడంతో అధికారులంతా సిద్ధంగా ఉండాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందాలన్నారు. జేసీ వెంట జిల్లా రిజిస్ట్రార్ ఏ బాలాంజనేయులు, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ చంద్రశేఖర్, కమిషనర్ ఫణికుమార్, రిజిస్ట్రార్ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.


బ్లడ్‌గ్రూప్ నిర్ధారణ పరీక్షలు



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న టీం సేవియర్స్

కావలి: పట్టణంలోని వశిష్ట జూనియర్ కళాశాలలో టీం సేవియర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు మంగళవారం బ్లడ్‌గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సుమారు 150 మంది విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్ నిర్ధారించి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు రక్తపరీక్షలు, రక్తంలోని గ్రూపులు, రక్తదానం ఆవశ్యకతపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అల్తాఫ్, టీం సేవియర్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



భోజనం రుచిచూస్తున్న సర్పంచ్ దిలీప్‌కుమార్

వరికుంటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన పథక నిర్వాహకులు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సర్పంచ్ కె.దిలీప్‌కుమార్ చెప్పారు. ఆయన మంగళవారం పంచాయతీలోని జంగంరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి రుచి చూశారు. ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నదన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్, పీఎంసీ చైర్మన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి



అవగాహన కల్పిస్తున్న చైర్మన్, ఉపాధ్యాయుడు

వరికుంటపాడు: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని పెద్దిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఎంసీ కమిటీ చైర్మన్ నాదెండ్ల చిన్న రమణయ్య, ఉపాధ్యాయుడు ఆర్.నాగార్జున కోరారు. మంగళవారం ఆర్లపడియలో 'బడి పిలుస్తోంది రా' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించి విద్యార్థులను నమోదు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందని, నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారన్నారు. ఉన్నత పాఠశాలల్లో పది పరీక్షల్లో 583 మార్కులు సాధించిన విద్యార్థిని డివిజన్ స్థాయిలో ప్రథమంగా నిలిచిందన్నారు. జగనన్న కిట్‌ల ద్వారా విద్యాసామగ్రి, గోరుముద్ద ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



విద్యాకానుక కిట్‌ను పంపిణీ చేస్తున్న నాయకులు

అల్లూరు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి మరువలేనిదని వైఎస్సార్ సీపీ మండల నేత నీలం సాయికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌డీఆర్ కాలనీలోని గురుకుల పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి బ్యాగ్, టై, షూస్, నోట్ పుస్తకాలు, టెస్ట్ పుస్తకాలు, యూనిఫాంలు, బెల్టులు, అందజేస్తున్నమన్నారు. ఈ ఏడాది కొత్తరకం యూనిఫాంలు వచ్చాయని, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా యూనిఫాంలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వీవీ రమణప్రసాద్, నాయకులు షేక్ ఉస్మాన్ షరీఫ్, నిమ్మల భాస్కర్, బత్తల సుధాకర్, షేక్ రసూల్, చెంతాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఊటుకాలువలో పూడిక తీత పనులు



కాలువ పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న తూమాటి విజయభాస్కర్‌రెడ్డి

చేజర్ల: చేజర్లలోని ప్రధానమైన ఊటుకాలువ పూడిక తీత పనులను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తూమాటి విజయ భాస్కర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చేజర్ల మెట్ట ప్రాంత రైతుల పంటల సాగులో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూస్తామని తెలిపారు. చేజర్ల మండల వైఎస్సార్‌సీపీ నేత బోయిళ్ల మాలకొండారెడ్డి నాలుగు గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి తన సొంత నిధులు సమకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజినీర్ సురేష్‌బాబు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ బషీర్, చేజర్ల ఉప సర్పంచ్ పుల్లయ్య యాదవ్, సచివాలయ కన్వీనర్ పటాన్ రసూల్, నాయకులు ఆనంద్‌రెడ్డి గణేష్, మహబూబ్ హుస్సేన్, బాలయ్య, రైతు సంఘం నాయకులు వీరాస్వామి, గంగయ్య, వెంకటేశ్వరరెడ్డి, పొట్టి మస్తానయ్య పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



రాజులపాడులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి ఎవరెన్ని విమర్శలు చేసినా, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అర్హులందరికీ క్రమం తప్పకుండా సంక్షేమ పథకాలను అందిస్తూ, మరో వైపు అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయిస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చెప్పారు. మర్రిపాడు మండలంలోని ఇర్లపాడు, ఇస్కపల్లి, రాజులపాడు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లతో కలిసి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు తెలియజెప్పారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్ర భవనం మరమ్మతులు, తాగునీటి సమస్యలు, పాడుపు రుణాల మంజూరులో ఇబ్బందులు, తదితర సమస్యలను స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా నెల రోజుల్లోగా అన్ని సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షలు నిధులు మంజూరు చేయిస్తామని అత్యవసర పనులను చేపట్టి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో మరో మారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకునేందుకు ప్రజలంతా తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ మండల కో ఆర్డినేటర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, స్థానిక ఎంపీటీసీ అబ్దుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు ముటుకుంద లక్ష్మీరెడ్డి, మౌలాలి, గంగినేని బాబు, గుర్రం నాగేశ్వరరావు, దుద్దుగుంట రామకృష్ణారెడ్డి, మౌలాలి, గువ్వల వెంగళరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సంగమేశ్వరుడికి లక్ష మల్లెలార్చన



లక్ష మల్లెలార్చన కార్యక్రమంలో దేవదేవేరులు

సంగం: త్రివేణి సంగమం ఒడ్డున కొలువైన కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి లక్ష మల్లెలార్చన నిర్వహించారు. ఆలయంలోని మండపంలో ఆది దంపతులను ఆశీనులను చేసి విశేషపూలతో సుందరంగా అలంకరించారు. వేద పండితులు, వేద మంత్రోచ్ఛారణలతో లక్ష మల్లెపూలతో అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు తెచ్చిన మల్లెపూలను స్వామి, అమ్మవార్లకు సమర్పించారు.

వైభవంగా గంగాభవాని మహోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో గంగాభవాని అమ్మవారు

ఉదయగిరి: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో ఆదివారం నుంచి జరుగుతున్న గంగాభవాని అమ్మవారి మహోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకాలంకరణ చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని గోత్రనామాలతో పూజలు నిర్వహించుకున్నారు. మధ్యాహ్నం పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఉత్సవాలు ముగిశాయి.

సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ సంతృప్త స్థాయిలో అందేలా అధికారులు పని చేయాలని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బట్టేపాడు, అప్పారావుపాళెం సచివాలయాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై సమీక్షించారు. ఇప్పటి వరకు అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతుందని, సాంకేతిక కారణాల వల్ల ఎవరికైనా లబ్ధి జరగకపోతే గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తించి సచివాలయ సిబ్బంది వారికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వానికి నివేదికలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అప్పారావుపాళెం ఎంపీటీసీ పెమ్మసాని వేణమ్మ, బట్టేపాడు సర్పంచ్ చిన్న చెంచయ్య, పంచాయతీ కార్యదర్శి బొటిక నరసింహులు, వీఆర్ఓ రమణయ్య, సచివాలయ కన్వీనర్ చంద్రా హాజరత్ నాయుడు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

కలెక్షన్, సెంటర్, సోలార్‌కోల్డ్ రూముల పరిశీలన



స్టోరేజీని పరిశీలిస్తున్న జిల్లా ఉద్యావశాఖ అధికారి

దుత్తలూరు: ఉద్యానశాఖ సహకారంతో అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పథకం ద్వారా దుత్తలూరు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో దుత్తలూరులో నిర్మించిన కలెక్షన్ సెంటర్, సోలార్ కోల్డ్ రూములను మంగళవారం జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎంవీ సుబ్బారెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కలెక్షన్ సెంటర్‌లో రైతులు కూరగాయలు, పండ్లు, స్టార్టింగ్, క్లీనింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్ చేసుకొని అధిక ఆదాయం పొందవచ్చన్నారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు తక్కువగా ఉన్నప్పుడు పండ్లు, కూరగాయలను కోల్డ్ రూములో నిల్వ చేసుకుని అధిక ధర ఉన్నప్పుడు అమ్ముకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐ పీడీ డి.శ్రీనివాసులు, వింజమూరు ఉద్యాన శాఖ అధికారి షేక్ షకీల్, డీఆర్‌డీఏ ఏపీఎం శ్రీనివాసులు, ఎఫ్‌పీఓ సీసీ కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఉద్యాన అధికారి



జమ్మలపాళెం సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఉద్యాన అధికారి

జలదంకి: మండలంలోని జమ్మలపాళెం సచివాలయాన్ని మంగళవారం జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎంవీ సుబ్బారెడ్డి తనిఖీ చేశారు. సచివాలయంలో ఉద్యోగుల హాజరు పట్టీ, రికార్డులు, లబ్దిదారుల జాబితాలను, వివిధ పథకాలకు సంబంధించిన పోస్టర్లు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, విధులు నిర్వహిస్తున్న సమయంలో తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని తెలిపారు. జిల్లా ఏపీ ఎంఐపీ పీడీ డి.శ్రీనివాసులు మంగళవారం అన్నవరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన సచివాలయ రికార్డులు పరిశీలించారు. ఉదయగిరి ఉద్యానశాఖ అధికారి షేక్ షహీల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపై దృష్టి సారించాలి

ఉదయగిరి: మండలంలోని పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఈఓపీఆర్డీ మల్లికార్జున సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని శకునాలపల్లిలో శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులతో వీధులు, మురికి ప్రాంతాలను, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. కార్యదర్శులు పంచాయతీల్లో వారానికోసారి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, వీధిలైట్ల సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు.